
ఉత్సాహంగా శ్రీకృష్ణ జన్మాష్టమి 2




2 రక్తం పీల్చేస్తున్నాయి..



AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com


## తహశీల్దార్ ఎదుట బైండోవర్




**అక్షరటుడే, ఆర్మూర్ :** రాబోయే వినాయక చవితి, దసరా ఉత్సవాలు సందర్భంగా ఆర్మూర్ పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు డీజే ఓనర్లు, ఆపరేటర్లను ఆర్మూర్ తహశీల్దార్ ఎదుట గురువారం బైండోవర్ చేశారు.



రాష్ట్ర రాజకీయాల్లో సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. కేబినెట్ విస్తరణ అంటూ జోరుగా ప్రచారం సాగుతున్న తరుణంలో కామారెడ్డి జిల్లాకు మంత్రి పదవి ఈసారి పక్కా అనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో మంత్రులుగా అవకాశం వచ్చినా, కామారెడ్డి జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్కసారి మినహా ఆశించిన స్థాయిలో మంత్రి పదవి దక్కలేదన్న చర్చ ఉంది. దీనికి ఫుల్ స్టాప్ పెట్టేలా ఈసారి పదవి ఖాయమనే ప్రచారం సాగుతోంది.

– అక్షరటుడే, కామారెడ్డి

# మంత్రి పదవి ఖాయమేనా..?



- ఈసారి కేబినెట్ విస్తరణలో కామారెడ్డి జిల్లాకు ఛాన్స్..!
- ప్రముఖంగా వినిపిస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పేరు
- ఈసారి బెర్త్ పక్కా అంటూ ప్రచారం
- మరికొద్ది రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం

మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం దగ్గర పడుతుందన్న సంకేతాలు వస్తుండటంతో జిల్లాలో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఒకే పేరు చక్కర్లు కొడుతూనే ఉంది. ప్రస్తుతం అదే వ్యక్తికి కేబినెట్‌లో అవకాశం లభిస్తుందన్న టాక్ పొలిటికల్ వర్గాల్లో జరుగుతోంది.

### కామారెడ్డి జిల్లాకు ఛాన్స్!

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు దాటినా కామారెడ్డి జిల్లాకు మంత్రివర్గంలో చోటు దక్కలేదు. దీనిపై జిల్లా నాయకులు, కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. ఇప్పుడు జరగబోయే విస్తరణలో సామాజిక, ప్రాంతీయ సమతుల్యత పాటించాలనే ఉద్దేశంతో ఈసారి కామారెడ్డికి ఛాన్స్ ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోందని అధిష్టాన వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.

### ఎల్లారెడ్డి ఎమ్మెల్యేకు మంత్రి పదవి..?

ఈ రేసులో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. కామారెడ్డి నుంచి సీఎం రేవంత్ రెడ్డి పోటీ చేసి ఓడిపోగా, జుక్కల్‌లో ఎస్సీ సామాజిక వర్గం నుంచి లక్ష్మీకాంత్ రావు గెలుపొందారు. బాన్సువాడ నుంచి బీఆర్ఎస్ నుంచి గెలిచిన పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రస్తుతం ప్రభుత్వ సలహాదారుగా కొనసాగుతున్నారు.

### విద్యార్హతలో కూడా బెస్ట్

మదన్ మోహన్ రావు విద్యార్హత కూడా ఆయనకు ప్లస్ అవుతోంది. ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ, అమెరికాలోని ప్రతిష్టాత్మక వార్టన్ బిజినెస్ స్కూల్ నుంచి ఎంబీఏ పూర్తి చేశారు. యూఎస్ఎం బిజినెస్ సిస్టమ్స్ కంపెనీ వ్యవస్థాపకుడిగా ఐటీ రంగంలో మంచి అనుభవం ఉంది. అందుకే ఆయనకు ఐటీ లేదా పరిశ్రమల శాఖ లాంటి కీలక శాఖ ఇస్తే బాగుంటుందని పార్టీలో ఒక వర్గం వాదిస్తోంది. గతంలోనే ఆయనకు మంత్రి పదవి ఇవ్వాలని కార్యకర్తలు ఆలయాలకు పాదయాత్రలు కూడా చేపట్టారు.

### ఏడేళ్లుగా చేజారుతున్న మంత్రి పదవి

కామారెడ్డి జిల్లా ఏర్పడినప్పటి నుంచి జిల్లాకు మంత్రి పదవి దక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది. 2016 అక్టోబర్ 11న ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి కామారెడ్డి జిల్లా ఆవిర్భవించింది. జిల్లా ఏర్పడిన మొదట్లో బీఆర్ఎస్ హయాంలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఒక్కరే వ్యవసాయ శాఖ మంత్రిగా చేశారు. 2018 ఎన్నికల తర్వాత ఎవరికి మంత్రి పదవి రాలేదు.

### ఈసారి బెర్త్ పక్కా అంటూ ప్రచారం..

ప్రస్తుతం మదన్ మోహన్ రావు ఢిల్లీలోనే మకాం వేసి అధిష్టానం పెద్దలతో లాబీయింగ్ చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. దాదాపు బెర్త్ ఖాయమైందని, అధికారిక ప్రకటన ఒక్కటే తరువాయి అంటూ ఆయన అనుచర వర్గంలో జోరుగా ప్రచారం సాగుతోంది.

### వారం రోజుల్లో స్పష్టత..?

మంత్రివర్గ విస్తరణపై అధిష్టానం కసరత్తు ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ఢిల్లీ పెద్దలతో చర్చలు జరుపుతున్నారు. గత కొద్ది రోజులుగా రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌తో వరుస భేటీలు జరుగుతున్నాయి. ఈ నెలాఖరులోగా విస్తరణ ఉంటుందని, అందులో భాగంగా మూడు నుంచి నాలుగు బెర్తులను భర్తీ చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈసారి కూడా కామారెడ్డి జిల్లాకు మొండిచేయి ఎదురైతే పార్టీకి తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని నేతలు హెచ్చరిస్తున్నారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేయాలన్నా, స్థానిక సంస్థల ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించాలన్నా మంత్రి పదవి ఇవ్వాలంటున్నారు.



## యూరియా సరఫరాలో కాంగ్రెస్ అట్టర్ ఫ్లాప్ : మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



**అక్షరటుడే, నందిపేట్/ఆర్మూర్ :** రాష్ట్రవ్యాప్తంగా యూరియా సరఫరాలో కాంగ్రెస్ అట్టర్‌ఫ్లాప్ అయిందని మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనకు నిరసనగా నందిపేట్ మండల కేంద్రంలోని నంది విగ్రహం వద్ద రైతు సదస్సులో పాల్గొన్నారు. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ద్రోహుల ప్రభుత్వమన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ ఇచ్చి మోసం చేసినందున రైతులు క్షమించరన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ను నిర్లక్ష్యం చేసి తెలంగాణ భూములను ఎండబెట్టి రైతులు పొట్టకొట్టిన కాంగ్రెస్‌ది రాక్షస జాతిగా ఆయన అభివర్ణించారు. కేసీఆర్ కట్టిన ప్రాజెక్టులపై కాంగ్రెస్ కక్ష తెలంగాణ రైతులకు శిక్ష అన్నారు. రైతు రుణమాఫీ పెద్ద బోగస్ అని.. రేవంత్ సర్కార్ తీరుతో అన్నదాతలు ఆగమయ్యారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు 24 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రస్తుతం క్షేత్రస్థాయిలో 8 నుండి 12 గంటల వరకు కూడా కరెంటు ఇవ్వట్లేదన్నారు. తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల జాబితా వ్యవహారంలో జీవన్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 22ఏ జాబితాలో నుండి భూములను తొలగించాలంటూ ఎన్‌వోసీలు ఇవ్వడానికి ల్యాండ్ వ్యాల్యూలో 30శాతం వరకు కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని ఆరోపణలు చేశారు. ఆశన్న గారి జీవన్ రెడ్డి పోలీసుల తీరుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుండి జరుగుతున్న పరిణామాలపై ఆయన మండిపడ్డారు. పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా మారిపోయి బీఆర్ఎస్ కార్యకర్తలను హింసిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్ రావు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## వినాయకుడి రూపంలో సైబర్ పాఠాలు.. పోలీసుల వినూత్న ప్రచారం




**అక్షరటుడే, కామారెడ్డి:** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కామారెడ్డి జిల్లా పోలీసులు సైబర్ నేరాలపై వినూత్న రీతిలో అవగాహన కల్పిస్తున్నారు. వినాయకుడి రూపంలోని అంశాలను సైబర్ భద్రతా సూత్రాలతో అనుసంధానిస్తూ 'వినాయకుడు మనకు నేర్పే పాఠాలు సైబర్ విజ్ఞానం కలిగి ఉండండి' అనే నినాదంతో రూపొందించిన ప్రత్యేక పోస్టర్‌ను జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వినాయకుడి పెద్ద చెవుల మాదిరిగా అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లను జాగ్రత్తగా చూడాలన్నారు. అలాగే మోదకాన్ని రహస్యంగా ఉంచినట్లు పిన్, ఓటీపీ, పాస్ వర్డ్ లు, బ్యాంక్ వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని, మూషిక వాహనం లాంటి ఇంటర్నెట్‌ను బాధ్యతాయుతంగా వాడాలని, ముఖ్యమైన లావాదేవీలను నమోదు చేసుకుని అనుమానం వస్తే వెంటనే స్పందించాలని తెలిపారు. ఉత్సవాల సమయంలో నకిలీ విరాళాల పేరుతో క్యూఆర్ కోడ్‌లు పంపడం, ఫేక్ ఉత్సవ కమిటీల పేరుతో డబ్బులు అడగడం, నకిలీ కస్టమర్ కేర్, ఓటీపీ మోసాలకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ముందుగా ఆలోచించి తర్వాత క్లిక్ చేయాలని, అప్రమత్తతే ప్రతి ఒక్కరికి రక్షణ కవచమని పిలుపునిచ్చారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలని లేదా http://cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని కోరారు..

## వినాయక నిమజ్జన ప్రాంతాల పరిశీలన

**అక్షరటుడే, భీమ్‌గల్ :** రానున్న వినాయక చవితి పండుగను పురస్కరించుకుని భీమ్‌గల్ పట్టణంలోని రాఘున్నకుంట నిమజ్జన ప్రాంతాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి, కమిషనర్ డి.గజానంద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, రహదారుల పునరుద్ధరణతో పాటు తగిన భద్రతా చర్యలు ముందస్తుగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జనానికి అవసరమైన అన్ని మౌలిక వసతులను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పూర్తి చేస్తామని వారు తెలిపారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునేలా ప్రజలు, వినాయక మండపాల నిర్వాహకులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు తోట సతీష్, అంజుమాలీ, సందీప్, సంగ్యా నాయక్, ప్రజాప్రతినిధులు నర్సయ్య, బోదిరే నర్సయ్య, గున్నాల భగత్ తదితరులు పాల్గొన్నారు.





## బ్యాంకులో చిక్కుకున్న రూ.50 లక్షల వేతనాలు

**అక్షరటుడే, కామారెడ్డి:** జీతం కోసం చెమటోడ్చిన పంచాయతీ కార్మికులకు చుక్కెదురైంది. ప్రభుత్వం జమ చేసిన వేతనాలు బ్యాంకులోనే పెండింగ్ పడ్డాయి. అక్షరాలా రూ.50 లక్షలకు పైగా మొత్తం నిలిచిపోవడంతో కార్మికులు లబోదిబోమంటున్నారు. గాంధారి మండలంలో 45 గ్రామ పంచాయతీలు ఉండగా, 38 పంచాయతీలకు చెందిన వంద మందికి పైగా కార్మికులకు కామారెడ్డిలోని కోటక్ మహీంద్రా బ్యాంకులో ఖాతాలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి వచ్చే జీతాలు నేరుగా ఈ ఖాతాల్లోనే జమ అవుతాయి. అయితే గత 13 నెలలుగా జమ అవుతున్న జీతాలను బ్యాంకు అధికారులు విడుదల చేయడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో విసిగిపోయిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, కార్మికులు గురువారం మూకుమ్మడిగా బ్యాంకుకు చేరుకుని మేనేజర్‌ను నిలదీశారు. మేనేజర్ మాత్రం టీఎస్‌బీపాస్ తర్వాత వచ్చిన 5 నెలల జీతాలే ఇస్తామని, గత 8 నెలల సంగతి తమకు తెలియదని చెబుతున్నారని కార్మికులు వాపోతున్నారు. తాను రెండు నెలల క్రితమే బదిలీపై వచ్చానని, టెక్నికల్ ఇష్యూ వల్లే జాప్యం జరిగిందని మేనేజర్ బదులిచ్చారు. శుక్రవారం వరకు గడువు ఇవ్వాలని, సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన జెడ్పీ సీఈవో



**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని బూర్గుల్, కరక్వాడి, గాంధారి గ్రామపంచాయతీలను జెడ్పీ సీఈవో చందర్ గురువారం పరిశీలించారు. బూర్గుల్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్‌హెచ్‌జీ ఆధ్వర్యంలో నిర్మాణాలు, కమ్యూనిటీ ప్లాంటేషన్ పనులను మార్కవుట్ చేశారు. కరక్వాడి గ్రామపంచాయతీ పరిధిలోని ట్రైనింగ్ సోప్ పిట్ కమ్యూనిటీ పనులను పరిశీలించారు. అనంతరం గాంధారి మండలంలోని ఎస్‌బీఎం కింద జరుగుతున్న కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ పనులను పరిశీలించారు. వెంటనే పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నయవంచక పాలనను ఎండగడతాం : మాజీ ఎమ్మెల్యే బిగాల

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** రాష్ట్రంలో కాంగ్రెస్ నయవంచక పాలనను ఎండగడతామని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా అన్నారు. కాంగ్రెస్ వెయ్యి రోజు పాలనపై ఆయన జిల్లా కేంద్రంలో మాట్లాడారు. 22ఏ నిషేధిత జాబితా పేరుతో ప్రైవేట్ భూముల యజమానులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని బిగాల ఆరోపించారు. రైతు భరోసా, రైతు బీమా, ఉచిత విద్యుత్ పథకాలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజల ఆస్తులకు, భూములకు రక్షణ లేకుండా పోయిందని మండిపడ్డారు. ముఖ్యంగా 22ఏ నిషేధిత జాబితాలో ప్రైవేట్ భూములు చేర్చడం వల్ల రైతులు, భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అధికారుల తప్పిదాలకు ప్రజలను బాధ్యులను చేసి, ఇప్పుడు వారు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి కల్పించడం సరికాదని బిగాల పేర్కొన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా దేశానికి అన్నంపెట్టే స్థాయికి తెలంగాణ రైతాంగాన్ని కేసీఆర్ ప్రభుత్వం తీసుకెళ్లిందని గణేష్ బిగాల అన్నారు. తెలంగాణలో సాగు విస్తీర్ణం, వరి ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని, దేశ ఆహార భద్రతలో తెలంగాణ రైతులు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అందాల్సిన రైతు భరోసా, రైతు బీమా, ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం చేస్తూ, ఎరువుల విషయంలో కూడా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. బోధన్ పట్టణంలో దాదాపు 40 శాతం భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల ప్రజలు తమ భూములను అమ్ముకోలేక, కొనుగోలు చేయలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గణేష్ బిగాల తెలిపారు. మాజీ మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్, నగర అధ్యక్షుడు సిర్ప రాజు, మాజీ నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సత్య ప్రకాష్, సుజిత్ సింగ్, నవీద్ ఇక్బాల్, అబ్దుల్ మతీన్, జగత్ రెడ్డి పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ 1,000 రోజుల పాలనపై బాల్కొండలో ర్యాలీ, సభ



**అక్షరటుడే, బాల్కొండ:** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1,000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా బాల్కొండ మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ, సభ నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి సామ రామ్మోహన్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు స్వేచ్ఛాయుత పాలన అందుతోందని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో నియంతృత్వ ధోరణి కొనసాగిందని విమర్శించారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిపై కూడా నాయకులు విమర్శలు చేశారు. మహిళల సంక్షేమం, ఆర్థిక సాధికారత కోసం మహాలక్ష్మి, మహిళా శక్తి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం





**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమని మెడికవర్ హాస్పిటల్స్ జనరల్ మెడిసిన్ కన్సల్టెంట్ డాక్టర్ ఆనంద్ మాలు, డైటీషియన్ శ్రీలేఖ అన్నారు. సెప్టెంబర్ 1 నుండి 7 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించే 'జాతీయ పోషణ వారోత్సవాలు' సందర్భంగా హాస్పిటల్‌లో మాట్లాడారు. మన జీవనశైలే సర్వరోగాలకు కారణమని వైద్యుడు ఆనంద్ మాలు అన్నారు. నేటి జీవనశైలిలో సరైన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల టైప్2 మధుమేహం (డయాబెటిస్), అధిక రక్తపోటు (బీపీ), గుండె సంబంధిత సమస్యలు, ఊబకాయం వంటి వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. సమతుల్య ఆహారం తీసుకోకపోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గి, తరచూ ఇన్‌ఫెక్షన్లు బారిన పడే అవకాశం ఉంది అని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ ఏడాదికి ఒకసారైనా విటమిన్ డీ, విటమిన్ బీ-12, ఐరన్, హిమోగ్లోబిన్ శాతాన్ని పరిశీలించుకోవాలని తెలిపారు. ప్యాక్ చేసిన, జంక్ ఫుడ్, మితిమీరిన ఉప్పు, నూనె, చక్కెర కలిగిన పదార్థాలను తగ్గించాలని పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాపై దోమలు దండు దాడి చేస్తోంది. వెంటపడి మరీ రక్తం పీల్చేస్తున్నాయి. ఇంట్లో, ఆరుబయట కాసేపు ప్రశాంతంగా ఉందామన్నా ఉండనివ్వని పరిస్థితులు నెలకొన్నాయి. పల్లె, పట్టణం అంటూ తేడాలేకుండా దోమలు విజృంభిస్తున్నాయి. మురుగు కాలువల పరివాహక ప్రాంతాలు, బస్తీల్లో దోమల సమస్య మరింత జఠిలంగా ఉంది. ఇంత జరుగుతున్నా మున్సిపల్, ఆరోగ్య శాఖ సిబ్బందిలో చలనం లేకుండా పోయింది.

\- అక్షరటుడే, ఎల్లారెడ్డి

# రక్తం పీల్చేస్తున్నాయి..



- ఉమ్మడి జిల్లాలో దోమల దండు దాడి..
- విషజ్వరాల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

మురుగు నిల్వలతో పాటు దోమల దండుతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా లో వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయి. దీంతో జ్వరాలతో ప్రజలు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. గత రెండు మూడు వారాలుగా సీజన్లు మారుతున్న నేపథ్యంలో వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయి. ముఖ్యంగా ఓపెన్ మురుగు కాలువలు, ఇళ్ల మధ్య ఖాళీ ప్రదేశాల్లో వర్షం నీరు నిల్వ, పైప్‌లైన్ లీకేజీలు ఉండటంతో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి.

### ఆస్పత్రుల్లో రోగుల రద్దీ

కామారెడ్డి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి, నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పాటు ఎల్లారెడ్డి, బాన్సువాడ, బోధన్ ఏరియా ఆస్పత్రుల్లో జ్వరాలతో వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రతిరోజూ వందల సంఖ్యలో ఓపీకి వస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది వైరల్ జ్వరాలు, కీళ్లు, కండరాల నొప్పుల వల్ల రోగులు కనీసం నిలబడలేక, తీవ్రమైన నీరసంతో మంచాన పడుతున్నారు. డెంగీ బారిన పడిన వారికి రక్తంలో ప్లేట్‌లెట్ల సంఖ్య వేగంగా క్షీణిస్తుండటంతో రోగులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. హఠాత్తుగా 102నుంచి 104 వరకు జ్వరం రావడం, చలి, వణుకుతో రోగులు అల్లాడిపోతున్నారు.

### దోమల ద్వారా వచ్చే వ్యాధులు

పరిసరాల్లో నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు పెరిగి డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. ఈ సీజన్‌లో ముఖ్యంగా టైఫాయిడ్ కేసులు పెరుగుతున్నట్లు ఆరోగ్య శాఖ పేర్కొంది. వీటితో పాటు కామెర్లు (జాండిస్), కలరా వచ్చే అవకాశం ఉంది. గాలిద్వారా వచ్చే వైరస్‌లు ఇన్‌ఫ్లుయెంజా, సాధారణ వైరల్ జ్వరాలు గాలిద్వారా ఒకరి నుంచి ఒకరికి వేగంగా వ్యాపిస్తున్నాయి.

### పట్టణాల్లో ఘోరం..

పట్టణాల్లోని మురుగు కాల్వలు (నాలాలు), ఓపెన్ డ్రెయిన్లు, ఇళ్ల మధ్య ఖాళీ ప్రదేశాలు, ఇటీవల కురిసిన వర్షాలతో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. పలు కాలనీల్లో రహదారిపై నీరు నిలుస్తోంది. పారిశుధ్య పనులు సక్రమంగా జరగక దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఫలితంగా సీజనల్ వ్యాధులు వేగంగా విస్తరిస్తున్నాయి. డెంగీ, మలేరియా, చికున్ గున్యా, వైరల్ జ్వరాల కేసులతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు రోగులు క్యూ కడుతున్నారు. దీంతో ఆస్పత్రులు కళకళలాడుతున్నాయి.

### శాఖల మధ్య సమన్వయ లోపం..

మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు, వైద్యారోగ్య శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. దోమలు పెరుగుతున్నాయంటే రెండు శాఖలు మేం బాగానే పనిచేశామని, వాళ్లదే తప్పు అన్నట్లు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులున్న కాలనీల్లో ఫాగింగ్ కార్యక్రమాలు కొంత వరకు మెరుగ్గా ఉన్నా.. ఇతర ప్రాంతాలకు ఫాగింగ్ యంత్రం వచ్చిన దాఖలాలే లేవు.

### వైద్యుల సూచనలివే..

ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. దోమతెరలు, మస్కిటో రిపెల్లెంట్ వాడాలి. జ్వరం వస్తే సొంత మందులు వాడకుండా వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. కొబ్బరి నీరు, పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలి. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

### ఆగస్టులో 65వేలకు పైగా ఓపీ కేసులు

కామారెడ్డి జిల్లాలోని అన్ని టీవీపీ ఆస్పత్రుల్లో ఆగస్టు -2026 నెలలో ఓపీ, ఐపీ, జ్వరాలు, కేసుల వివరాలను జిల్లా ఆస్పత్రికి సూపరింటెండెంట్ వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా 8 ఆస్పత్రులతో కలిపి మొత్తం 65,002 ఓపీ కేసులు, 5,028 ఐపీ కేసులు నమోదయ్యాయి. ఇందులో జ్వర కేసులు 5,293 నమోదయ్యాయి. ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాకుండా ప్రైవేట్‌లో వందల సంఖ్యలో ప్రజలు వివిధ రుగ్మతలతో బాధపడుతూ చికిత్సలు పొందుతున్నారు.










# ఉత్సాహంగా శ్రీకృష్ణ జన్మాష్టమి

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పాఠశాలల్లో గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి బోధనలు, ధర్మ పరిరక్షణ, సత్యనిష్ఠ, క్రమశిక్షణ వంటి విలువలను విద్యార్థులు జీవితంలో ఆచరించాలని ఉపాధ్యాయులు సూచించారు. పండుగల ద్వారా విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించారు. – అక్షరటుడే, నెట్‌వర్క్








## 36 గంటల్లోనే దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** దోపిడీ జరిగిన కేసులో నిందితులను పోలీసులు 36 గంటల్లోనే పట్టుకున్నారు. ఈ మేరకు నాగిరెడ్డి పేట పోలీసులు వివరాలు వెల్లడించారు. గతనెల 31న గోపాల్‌పేట్‌లోని దత్తు హాస్పిటల్ ఎదుట మెదక్ జిల్లా పోచమ్మరాల్ గ్రామానికి చెందిన దంపతులను ముగ్గురు వ్యక్తులు మాయమాటలు చెప్పి, బెదిరించి వారి వద్ద ఉన్న సుమారు 12 తులాల వెండి గొలుసు, రూ.15 వేల నగదును దోచుకుని.. స్కూటీపై మెదక్ వైపు పారిపోయారు. ఈ ఘటనపై సమాచారం అందిన వెంటనే నాగిరెడ్డిపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులను గుర్తించేందుకు వివిధ ప్రాంతాల్లోని సీసీ టీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించడంతో పాటు, హ్యూమన్ ఇంటెలిజెన్స్‌ను సమర్థవంతంగా వినియోగించారు. పోలీసుల సమన్వయంతో నిందితుల కదలికలు, వివరాలను 36 గంటల్లోనే గుర్తించారు. ఈనెల 2న నిందితులు తిరిగి నాగిరెడ్డిపేట మండలం వైపు వస్తున్నారనే విశ్వసనీయ సమాచారం అందడంతో, పోలీసులు అప్రమత్తమై పోచారం చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు చేపట్టి ముగ్గురు నిందితులను పట్టుకున్నారు. వారి వద్ద నుండి 12 తులాల వెండి గొలుసు, రూ.15,000 నగదు, నంబర్ ప్లేట్ లేని స్కూటీ, మూడు మొబైళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించారు.

## దేగాంలో ప్రజాపాలన వెయ్యి రోజుల సంబరాలు



**అక్షరటుడే, ఆర్మూర్ :** ప్రజా పాలన వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా ఆర్మూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ రెడ్డి ఆదేశాలతో ఆలూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దేగాం ప్రమోద్, సర్పంచ్ ఇట్టెడి లింగారెడ్డి ఆధ్వర్యంలో ఆలూరు మండలం దేగాం గ్రామంలో గురువారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రజాపాలన ద్వారా పేదలు, రైతులు, మహిళలు, యువతకు అనేక ప్రయోజనాలు అందుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింగారెడ్డి, గ్రామాధ్యక్షుడు యాదగౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, మండల సెక్రెటరీ గంగాధర్, లిఫ్ట్ ఛైర్మన్ రామగౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మల్లేష్, సాయి, మినీ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు బూట్లు అందజేత

**అక్షరటుడే, కోటగిరి :** పోతంగల్ మండలంలోని 25 పాఠశాలల్లో విద్యార్థులకు ఎంఈవో సాయిలు షూస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రతి విద్యార్థి ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ఉండాలనే ఉద్దేశంతో ఈ ఏడాది ప్రభుత్వం ప్రతి విద్యార్థికి ఒక జత షూ, రెండు జతల సాక్స్‌లను అందజేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ రమేష్, హెచ్ఎం ఉమాదేవి, రవి, బ్రహ్మం, బిలక్విస్ తదితరులు పాల్గొన్నారు.

